క్లుప్తంగా

బాబా మందిరంలో రామకృష్ణ పరమహంస జయంతి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో సోమవారం రామకృష్ణ పరమహంస జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, హారతులు, పారాయణం నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్ పర్యవేక్షించారు.

అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీకాలనీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విద్యాభివృద్ధితోనే సమాజ ప్రగతి

పెనమలూరు: విద్యాభివృద్ధితోనే సమాజ ప్రగతి ముడిపడి ఉందని డీసీఎంఎస్ చైర్‌పర్సన్, రక్ష ఫౌండేషన్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్నిగ్ధ మాట్లాడుతూ విద్య ద్వారా కుటుంబాలు ఉన్నత స్థాయికి చేరుకుంటాయన్నారు. చదువు విలువ తెలిసిన సీఎం జగనన్న విద్యాభివృద్ధి చర్యలు తీసుకున్నారని చెప్పారు. విద్య ఒక్కటే భవిష్యత్తులో ఇచ్చే విలువైన ఆస్తి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యలో అనేక విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చి విద్యాభివృద్ధికి పాటుపడుతుందన్నారు. ఆంగ్లమాధ్యమం ప్రవేశపెట్టడంతో పాటు నాడు–నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధికి సీఎం జగనన్న కృషి చేశారన్నారు. జగనన్నే స్ఫూర్తిగా విద్యాభివృద్ధికి రక్ష ఫౌండేషన్ చేయూత అందిస్తోందని చెప్పారు. పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం భవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చురుగ్గా మరమ్మతులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 31వ డివిజన్ వీవీ నరసరాజు రోడ్డులో మురుగు కాలువల మరమ్మతు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇటీవల పసుపుతోటలో స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీష వార్డు సచివాలయ సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మురుగు కాలువ సరిగా పారడం లేదని తెలుసుకున్నారు. దీంతో స్పందించిన ఆమె నగరపాలకసంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లారు. వారు స్వయంగా పరిశీలించి మురుగు కాలువలకు శాశ్వత మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో నగరపాలకసంస్థ అధికారులు మురుగు కాలువలకు మరమ్మతులు చేపట్టారు. మురుగు కాలువలతో పాటు యూజీడీ లీకేజీలకు అవసరమైన మరమ్మతుల పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి.

కొనసాగుతున్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పేదలకు పంపిణీ చేసిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ గ్రామ సచివాలయాల్లో కొనసాగుతున్నాయి. సోమవారం నున్న గ్రామంలోని మూడు సచివాలయాలతో పాటు మిగిలిన గ్రామ సచివాలయాల్లో కూడా లబ్ధిదారుల పేరిట ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు జరిగాయి. విజయవాడ రూరల్ మండలంలో 10,670కి 6,450 ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు జరిగాయని మండల తహసీల్దార్ పి.జాహ్నవి తెలిపారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని కోటకట్ట సెంటర్‌లో హిందూ సమాజ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు మాదు నాగ గోవర్ధన్, కార్యదర్శి ఆరేపల్లి శివ వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఆరేపల్లి రత్నాకర్, ఉపాధ్యక్షుడు మాదు మహేశ్వరరావు, పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

పాయకాపురం(విజయవాడరూరల్): పార్టీలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా సోమవారం 64వ డివిజన్‌లో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మతో కలిసి ఆయన పర్యటించారు. సుమారు 270 గడపలను సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రత్యేక ప్రచార రథంపై ప్రజలకు చూపించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ కుటుంబాలకు సైతం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. 64వ డివిజన్‌లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. డివిజన్‌లోని పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయనున్నట్లు వెలంపల్లి తెలిపారు. చంద్రబాబు టిడ్కో ఇళ్ల విషయంలో ప్రజలను మోసం చేశారని.. కానీ జగనన్న పాలనలో పేదలందరికీ ఇళ్లు పథకంతో పేదల సొంతింటి కల నెరవేరిందని వెల్లడించారు.

అసెంబ్లీలో అడుగుపెట్టే అర్హత బొండాకు లేదు

ప్రజలను భయపెడుతూ రౌడీయిజం చూపిస్తున్న బొండా ఉమాకు అసెంబ్లీలో అడుగుపెట్టే అర్హత లేదని వెలంపల్లి అన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలను రాత్రి సమయాల్లో వచ్చి భయపెడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని కార్యకర్తలను టచ్ చేసి చూడు నీ సంగతి చూస్తానని బొండా ఉమాను హెచ్చరించారు. తాను ఎవరికీ భయపడే వ్యక్తిని కాదన్నారు. బుద్దా వెంకన్న సీటు కోసం రక్తంతో రాస్తున్నాడంటే టీడీపీకి నిరసన వ్యక్తం చేస్తున్నట్టుందని వెలంపల్లి ఎద్దేవా చేశారు. అయోమయంగా ప్రవర్తిస్తున్న బుద్దా వెంకన్నను విశాఖపట్నంలోని మెంటల్ ఆసుపత్రికి తరలించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ కోఆర్డినేటర్ షేక్ ఇస్మాయిల్, పార్టీ శ్రేణులు యరగొర్ల శ్రీరాములు, పందిరి వాసు, కొక్కిలిగడ్డ నాని, జే శివ, వెంకటేశ్వరమ్మ, డివిజన్ ఇన్‌చార్జ్ జలసూత్రం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రచార వాహనంపై ప్రదర్శన తిలకిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గాయత్రి సొసైటీ సేవలు అభినందనీయం



సామూహిక ఉపనయనాల కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): గాయత్రీ సొసైటీ ఆధ్వర్యాన సత్యనారాయణపురంలోని శ్రీగాయత్రి కల్యాణ మండపంలో సోమవారం బ్రాహ్మణ బాలురకు సామూహిక ఉపనయనాల కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ కప్పగంతు సుబ్బరామ సోమయాజులు సమక్షంలో వేద పండితులు, ధార్మిక విద్యాధికుల మంత్రోచ్చారణల మధ్య 22 మంది వటువులకు యజ్ఞోపవీత ధారణ చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా విచ్చేసి వటువులకు ఆశీస్సులు అందజేశారు. భిక్షాటన, యజ్ఞోపవీతం ధరించిన అనంతరం ఆచరించవలసిన నియమాలను వటువులకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ బ్రాహ్మణ సామాజికవర్గ అభ్యున్నతికి దశాబ్దానికి పైగా గాయత్రీ సొసైటీ చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ప్రతీ ఒక్క వటువు త్రికాల సంధ్యావందనం, గాయత్రీ మంత్రోపాసనం తప్పనిసరిగా ఆచరించాలని సూచించారు. అప్పుడే వారి జీవన స్థితిగతులు ఉన్నత స్థాయికి చేరుకుంటాయన్నారు. ఈ సందర్భంగా త్రికాల సంధ్యావందన విశిష్టతను ఎమ్మెల్యే వివరించారు. సంధ్యావందనం సమయంలో సూర్య శక్తిని పొందేందుకు మనిషికి ఉన్న శక్తి చాలదు కనుక గాయత్రీ మంత్రాన్ని ఉచ్చరించడం జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్క బ్రాహ్మణుడు తన దైనందిన జీవితంలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ త్రికాల సంధ్యావందనాన్ని మరువకూడదని పేర్కొన్నారు. అలాగే 16 ఏళ్ల వయసులోపే ఉపనయనాలను పూర్తి చేసుకోవలసిందిగా బ్రాహ్మణ బాలురకు ఆయన సూచించారు. అనంతరం బ్రహ్మశ్రీ కప్పగంతు సుబ్బరామ సోమయాజులు మాట్లాడుతూ గురుముఖంగా అగ్నికార్య సాక్షిగా చెప్పబడే మంత్రమే గాయత్రీ మంత్రమని తెలిపారు. చిన్న వయసులో ఉపనయనం జరిగిన వారికి గాయత్రీ మాత అనుగ్రహం పుష్కలంగా ఉంటుందన్నారు. నిత్యం గాయత్రీ మంత్ర జపం అనేక సత్ఫలితాలనిస్తుందని.. త్రికాల సంధ్యావందనం ద్వారా అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని తెలిపారు. అలాగే ఉపనయనం జరిగిన వారు మాత్రమే పితృ కార్యక్రమాలకు అర్హులని చెప్పుకొచ్చారు. ప్రతీ ఒక్క వటువు క్రమం తప్పకుండా సంధ్యావందనం ఆచరించే విధంగా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తి, బ్రాహ్మణ కార్పొరేషన్ సీఈఓ నాగసాయి, గాయత్రీ సొసైటీ సెక్రటరీ చల్లా హరి కుమార్, ట్రెజరర్ జేకే సుబ్బారావు, మాజీ మేయర్ జంధ్యాల శంకర్, సభ్యులు లక్ష్మీనారాయణ, ఎస్ రవికుమార్, మారుతీప్రసన్న, జీవీఎస్ శర్మ, వటువులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణులు కావాలి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న అధికారులు

పాయకాపురం(విజయవాడరూరల్): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులందరూ ఉత్తీర్ణులు అయ్యే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి వీవీ సుబ్బారావు పేర్కొన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ పదో తరగతి విద్యార్థుల కోసం తయారు చేసిన ఒక మార్కు ప్రశ్నల భౌతికశాస్త్ర పుస్తకాన్ని విద్యాశాఖాధికారి విద్యార్థులకు అందజేశారు. ప్రతీ ఉపాధ్యాయుడు విద్యార్థులను దత్తత తీసుకుని పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యే విధంగా కృషి చేయాలని సూచించారు. ప్రత్యేక విధానం ద్వారా సైన్స్‌ను బోధించాలని ప్రయోగాలు, నమూనాలు చేసి విద్యార్థులు పరీక్షల్లో సులభంగా విజయం సాధించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు డీ మోహన్, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్, సుబ్రహ్మణ్యం, విజయ్‌కుమార్, ఎంఈఓ విజయరాము, పలువురు సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

32వ డివిజన్‌లో అభివృద్ధి పరుగులు

- బెజవాడ జూబ్లీహిల్స్‌గా లోటస్ ల్యాండ్‌మార్క్
- రూ. 10 కోట్లతో అభివృద్ధి పనులు



అయోధ్యనగర్‌లో నూతనంగా నిర్మించిన ఆరోగ్యకేంద్రం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 32వ డివిజన్‌లో అభివృద్ధి పరుగులు పెడుతోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన డివిజన్‌లో నాలుగు సంవత్సరాల పది నెలల కాలంలో రూ. 10 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టారు. కొద్ది పాటి వర్షానికే జలమయం అయ్యే లోటస్ ల్యాండ్‌మార్క్‌ను బెజవాడ జూబ్లీహిల్స్‌గా తీర్చిదిద్దారు. లోటస్ ల్యాండ్‌మార్క్‌లో మెయిన్ రోడ్డు, అంతర్గత రోడ్లతో పాటు ఉద్యానవనంను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. అలాగే డివిజన్‌లో రూ. 1.05 కోట్లతో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మించి మెరుగైన వైద్య సేవలు అందజేస్తున్నారు. అంతేకాకుండా డివిజన్‌లో శానిటరీ కార్యాలయం నిర్మించి అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. అలాగే ఎస్సీ కల్యాణ మండపం నిర్మాణ పనులు కూడా జరుగుతున్నాయి. ఇక్కడ టీడీపీ కార్పొరేటర్ అధికారంలో ఉన్నప్పటికీ అభివృద్ధిలో రాజీ లేకుండా ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రత్యేక చొరవ తీసుకుని అభివృద్ధి పనులు పూర్తి చేయిస్తున్నారు.



32వ డివిజన్‌లో రోడ్డు

ఎమ్మెల్యే చొరవతో అభివృద్ధి



గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ సమస్యలు నిత్యకృత్యంగా ఉండేవి. ప్రస్తుతం ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రత్యేక చొరవ తీసుకుని అభివృద్ధి పనులు పూర్తి చేశారు. డివిజన్‌లో వైద్య సేవలకుగానూ ఆరోగ్యకేంద్రం నిర్మించి 24 రకాల వైద్య పరీక్షలు, 172 రకాల మందులు ఎల్లవేళలా అందుబాటులో ఉంచారు. డివిజన్‌లో ఎన్నడూ జరగని అభివృద్ధి ఈ నాలుగు సంవత్సరాల పదినెలల కాలంలో జరిగింది.

– గుండే సుందర్‌పాల్, స్థానికుడు

డివిజన్‌పై ప్రత్యేక దృష్టి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో 32వ డివిజన్‌లో రూ. 10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. గత ప్రభుత్వంలో డివిజన్‌లో ఎటు చూసినా సమస్యలే కనపడేవి. మా ప్రభుత్వంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. చంద్రబాబు హయాంలో చెరువులను తలపించిన లోటస్ ప్రాంతాన్ని రూ. 6 కోట్ల నిధులతో మోడల్ ప్రాంతంగా తీర్చిదిద్దడం జరిగింది. అధికారం చేపట్టిన అనతికాలంలోనే ఈ ప్రాంత అభివద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి.. లోటస్ సెక్టార్‌ను మరో జూబ్లీహిల్స్‌గా తీర్చిదిద్దడం జరిగింది.

– మల్లాది విష్ణు, సెంట్రల్ ఎమ్మెల్యే

యువత క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులతో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని.. మన జీవితంలో ఎదురయ్యే ప్రతీ అంశంలో క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే, సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. వెలంపల్లి యూత్ ఆధ్వర్యంలో 28వ డివిజన్ భానునగర్ యూత్‌కు క్రికెట్ టోర్నమెంట్‌ను సింగ్‌నగర్ ఎంబీ స్టేడియంలో సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ యువతను క్రీడలవైపు నడిపించాలనే ధ్యేయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్రా'ను నిర్వహించారని తెలిపారు. ప్రతీ ఒక్కరు తమకు ఆసక్తి ఉన్న రంగంలో రాణిస్తే తప్పక విజయం సాధించవచ్చని పేర్కొన్నారు. ముందుగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే వెలంపల్లి, ఎమ్మెల్సీ ఏండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ శ్రీశైలజలు కాసేపు క్రికెట్ ఆడి అందరినీ అబ్బురపరిచారు.

ఘనంగా చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే



చిన్నారుల నృత్య ప్రదర్శన

మధురానగర్(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం రవీంద్ర భారతి పబ్లిక్ స్కూల్‌లో సోమవారం సాయంత్రం చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. చిన్నారులు అతిథుల చేతుల మీదుగా పట్టాలు అందుకుంటూ మురిసిపోయారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను రంజింపచేశాయి. ముఖ్య అతిథిగా ప్రముఖ పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ ఏ సత్యగోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పట్టాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులన్నారు. చిన్నతనం నుంచే ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పాఠశాల డైరెక్టర్ వీరమాచినేని వంశీకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ వీరమాచినేని శాంతి, ప్రిన్సిపాల్ నిమ్మగడ్డ హెప్సీబా చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో రమేష్, కిరణ్మయి, ఆదిలక్ష్మి, విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో మాడుగుల



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ద్విసహస్ర అవధాని మాడుగుల నాగఫణిశర్మ సోమవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన నాగఫణిశర్మకు ఆలయ ఈవో రామారావు సాదరంగా స్వాగతం పలికారు. దుర్గామల్లేశ్వరస్వామి వార్లను దర్శించుకున్న నాగఫణిశర్మకు ఆలయ ఈవో రామారావు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. అనంతరం చైర్మన్ కర్నాటి రాంబాబును నాగఫణిశర్మ, ఈవో రామారావు మర్యాద పూర్వకంగా కలిశారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అయాన్ హాస్పిటల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యాన బుధవారం హెడ్ పోస్టాఫీస్ ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ వావిలాల రజనీకాంతశర్మ తెలిపారు. బుధవాం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి వైద్య శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. పోస్టల్ శాఖ సిబ్బంది పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ నూతన కమిటీకి సత్కారం



వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ నూతన కమిటీని సత్కరిస్తున్న గౌతంరెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఎన్నికలకు కేవలం 60 రోజులు మాత్రమే ఉందని ప్రతీ ఒక్కరూ వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో సోమవారం నూతనంగా నియమించబడిన వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ కమిటీ సత్కార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిళ్లా రవి, అధికారి ప్రతినిధి కోటంరాజు సుజాత, కార్యదర్శి విఠల్‌రావును ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఏపీ ఫైబర్ నెట్ లిమిటెడ్ చైర్మన్ పూనూరు గౌతంరెడ్డి, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్‌లు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ అనుబంధ విభాగాలు పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. గౌతంరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ వై నాట్ 175 నినాదాన్ని నిజం చేయాలన్నారు. 175 స్థానాలు గెలిపించేందుకు అహర్నిశలు శ్రమించాలని పేర్కొన్నారు. లీగల్ సెల్ ప్రతినిధులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయ సాధనలో అలుపెరగని పోరాటం చేస్తామన్నారు. పార్టీ నిలబెట్టిన అభ్యర్థులను గెలిపించుకుంటామని అన్నారు. కార్యక్రమంలో లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ సాయిరాం, సమన్వయకర్త బసవారెడ్డి, కోటంరాజు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయ డెయిరీ పాడి రైతులకు ఉచిత వైద్య సేవలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కృష్ణా మిల్క్ యూనియన్(విజయ డెయిరీ) ఆధ్వర్యంలో పాడిరైతులకు సోమవారం ఉచిత వైద్య సేవలు అందించారు. మొగల్రాజపురంలోని అమెరికన్ గ్యాస్ట్రో కేర్ ఆస్పత్రిలో సోమవారం ఉదయం వైద్య సేవలు నిర్వహించారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన సుమారు 70 మంది పాడి రైతులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పాడిరైతులతో చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడారు. లివర్ ఆరోగ్యం తెలుసుకునేందుకు అత్యాధునికమైన ఫైబ్రోస్కాన్ పరీక్షలు చేయించారన్నారు. డాక్టర్ అట్లూరి శ్రీదేవి, ఆసుపత్రి సిబ్బంది తమ వైద్య సేవలను అందించారు. పాడి రైతుల సంక్షేమానికి కృష్ణా మిల్క్ యూనియన్ కృషి చేస్తుందని చైర్మన్ ఆంజనేయులు పేర్కొన్నారు. పాడి రైతులతో పాటు వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు అందించామన్నారు. కార్యక్రమంలో కృష్ణా మిల్క్ యూనియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దాసాంజనేయ విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేస్తున్న రుత్వికులు, భక్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎన్ కళాశాల ప్రాంగణంలోని దాసాంజనేయస్వామి దేవస్థానంలో స్వామి వారి విగ్రహ పునఃప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ సోమవారం శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక వైదిక కార్యక్రమాలను పూర్ణాహుతితో సోమవారం ముగించారు. సుమారు 50 అడుగులకు పైగా ఉన్న ధ్వజస్తంభాన్ని క్రేన్ సాయంతో తీసుకొచ్చి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. ఆలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠను రుత్వికులు వేద పఠనం మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. సుమారు 40 మంది పండితులు వేదపఠనాలను గావిస్తుండగా ఆగమ పండితుల ఆధ్వర్యంలో ఆయా కార్యక్రమాలు చేశారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణాన్ని రుత్వికులు చేయించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాన్ని కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసు, సహాయ కార్యదర్శి జీవీ రామారావు నిర్వహించారు. ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి మల్లయ్య, కోశాధికారి బాబా విజయకుమార్, పొట్టిశ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి లక్ష్మణ స్వామి, కోశాధికారి కొత్తమాసు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ సురక్షిత డ్రైవింగ్ చేస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని వన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గొల్లపూడి పరిధిలోని అట్కిన్‌సన్ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. 'సేఫ్టీ ఫస్ట్..హెల్మెట్ మస్ట్' అనే నినాదంతో హెల్మెట్ ధరించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవగాహన, ఆలోచనతో ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ రోడ్డుపై ప్రయాణిస్తే ప్రమాదాలు గణనీయంగా తగ్గుముఖం పడతాయని పేర్కొన్నారు. మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనాలను నడపటం, సెల్ ఫోన్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, ఓవర్ టేకింగ్ తదితర తప్పిదాలతో వారు ఇబ్బంది పడటమే కాకుండా ఎదుట వారుకూడా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని వివరించారు. డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా సూచనలతో ట్రాఫిక్ డీసీపీ చక్రవర్తి, ఏడీసీపీ ప్రసాద్ పర్యవేక్షణలో వన్ ట్రాఫిక్ ఏసీపీ జనార్దన రావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాలు



పెనమలూరు: పలుచోట్ల సోమవారం దేవతా మూర్తుల విగ్రహాలు, ధ్వజస్తంభాల ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆయా ఆలయాల్లో విశేష హోమాలు, పూజలు నిర్వహించారు. దీంతో ఆయా గ్రామాలకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొంది. పెనమలూరు గ్రామం పల్లిపేటలో సోమవారం శ్రీసీతారామచంద్రస్వామివారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాతసేవ విశ్వక్సేన పూజ, హోమాల నిర్వహించిన అనంతరం ఉదయం 10.38 గంటలకు భక్తుల సమక్షంలో విగ్రహ ప్రతిష్ఠ చేశారు. విగ్రహ ప్రతిష్ఠను కెడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జోగి రమేష్, గ్రామ సర్పంచ్ లింగాల భాస్కరరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు వనమాల ఏడుకొండలు, సభ్యులు శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.